క్లుప్తంగా

నారంవారిగూడెం వాసికి అవార్డు



అవార్డు అందుకుంటున్న కృష్ణనాయక్

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారం వారిగూడెం కాలనీ గ్రామానికి చెందిన కళాకారుడు, సాహసవీరుడు భూక్యా కృష్ణ నాయక్‌కు భారత్ బంజారారత్న అవార్డు దక్కింది. మహారాష్ట్రలోని పొరహగడ్‌లో తాజాగా నిర్వహించిన సమావేశంలో ఆయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, స్థానికులు కృష్ణకు అభినందనలు తెలిపారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ

దమ్మపేట: పీఆర్‌టీయూ, తెలంగాణ ఉపాధ్యాయ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆవిష్కరించారు. శనివారం మండలంలోని గండుగులపల్లి నివాసంలో ఎమ్మెల్యే జారేను, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పీఆర్‌టీయూ వార్షిక క్యాలెండర్‌ను, ఉద్యోగుల సమక్షంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాఠశాలల్లోని సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తగు ప్రణాళికలు సిద్ధం చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు బోళ్ల సుధాకర్‌రెడ్డి, మహ్మద్ జావీద్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో..

మణుగూరురూరల్: టీఎస్ యూటీఎఫ్ నూతన సంవత్సరం-2024 క్యాలెండర్లను మణుగూరు జెడ్పీ కోఎడ్యుకేషన్ పాఠశాలలో ఎంఈఓ వీరస్వామి, పీజీ హెచ్ఎం నాగశ్రీలు శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి మీరా హుస్సేన్, ఎం.ఇంద్రసేనారెడ్డి, తోట విజయలక్ష్మి, కృష్ణమూర్తి, పద్మ, జయమ్మ, రవికుమార్, కోటేశ్వరరావు, నిట్ట రాంబాబు, చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ పర్యవేక్షణ



టాలెంట్ టెస్ట్‌ను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ కీసర లక్ష్మి

దమ్మపేట: గణిత సమైఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జెడ్పీ స్కూల్‌లో నిర్వహించిన గణిత టాలెంట్ టెస్ట్‌ను ఎంఈఓ కీసర లక్ష్మి శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని డిసెంబర్ 22న నిర్వహించాల్సిన గణిత టాలెంట్ టెస్ట్‌ను శనివారం మండల స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించినట్లు తెలిపారు. మండల స్థాయిలో ఉత్తమ ప్రదర్శన చూపిన వారిని ఈ నెల 22న జరిగే జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు వెల్లడించారు. మీడియం వారీగా ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉషారాణి, మస్తాన్‌వలీ, గణిత సమైఖ్య సభ్యులు విజయశేఖరరెడ్డి, శ్రీను, నరేష్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

చర్లరూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి చదువులో రాణించాలని తేగడ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ కోరారు. రాబోయే పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని శనివారం విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. పరీక్షలకు ఇంకా రెండు నెలలు మాత్రమే ఉందని, తమ వంతుగా విద్యార్థులకు స్పెషల్ క్లాసులు కూడా చెబుతున్నామని అన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. సెల్ ఫోన్లకు, టీవీలకు దూరంగా ఉంచాలని కోరారు. పదో తరగతి పూర్తి కాగానే వివాహాలు చెయొద్దని ఉన్నత చదువులపైనే దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.

విద్యుత్ సబ్సిడీని వినియోగించుకోండి

భద్రాచలంఅర్బన్: ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సబ్సిడీ పొందాలని భద్రాచలం విద్యుత్ శాఖ ఏఈ రాజారావు శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులు కరెంట్ బిల్లుతో పాటు కులధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీలను విద్యుత్ కార్యాలయంలో అందజేయాలని అధికారులు తెలిపారు. అసిస్టెంట్ ఇంజినీర్ కార్యాలయం లేదా కరెంట్ బిల్లులు కట్టించుకును రెవెన్యూ ఆఫీస్ వద్ద ఆయా ధ్రువపత్రాలు అందజేసి విద్యుత్ రాయితీలని పొందవచ్చని సూచించారు.

పథకాలు అందేలా కృషి చేయాలి

- ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి
- అధికారులకు ఎమ్మెల్యే పాయం సూచన



మున్సిపాలిటీ పనులపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరురూరల్: ప్రజలందరికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఆయన ప్రజాభవన్‌లో మండల పరిషత్, మున్సిపల్ అధికారులతో వేర్వేరుగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మండల, మున్సిపాలిటీ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

ప్రజలకు ఏ సమస్య వచ్చినా వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు చేపట్టాలని, పథకాల అమలులో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. నూతనంగా చేపట్టనున్న అభివృద్ధి పనులు, పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశాల్లో ఎంపీడీఓ చంద్రమౌళి, మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, మున్సిపల్ ఏఈ సత్యనారాయణ, మండల పరిషత్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోడు పంటల పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న రేంజర్ రవికిరణ్

ములకలపల్లి: వలస ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు పంటలను ములకలపల్లి రేంజ్ ఆఫీసర్ రవికిరణ్ శనివారం సందర్శించారు. మండలశివారులోని ఆంధ్రా, తెలంగాణా సరిహద్దు ప్రాంతాల్లోని అటవీప్రాంతాల్లో గొత్తికోయలు సేద్యం చేస్తున్న ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటల సాగు విధానం, నీటి లభ్యత తదితర అంశాలపై వలస ఆదివాసీలను అడిగి తెలుసుకున్నారు. ఫారెస్ట్ మ్యాపును పరిశీలించారు. అడవులు ధ్వసం చేయొద్దని పోడు సాగుదారులను ఆదేశించారు. సామాజిక కార్యకర్త క్రాంతి, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

దుమ్ముగూడెం: మండల పరిధిలోని మారాయిగూడెం గ్రామంలో విద్యుత్ షార్ట్ షర్క్యూట్‌తో ఇళ్లు కాలిపోయిన బాధిత కారం రామకృష్ణ కుటుంబానికి ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్, ఆదివాసీ సంక్షేమ పరిషత్, దుమ్ముగూడెం మండల శాఖ ఆధ్వర్యంలో రూ.5,500ల నగదు, 25 కిలోల బియ్యం శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఏటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి జయబాబు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు, ఏటీఏ రాష్ట్ర నాయకుడు సోయం హనుమంతరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి యస్.సత్యనారాయణ, మండల అధ్యక్షుడు వాసం ఆదినారాయణ, వర్ష వసంతరావు, సోడి సత్యప్రసాద్ పాయం శ్రీను, తుర్రం ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుడికి..

బూర్గంపాడు: సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తూ అనారోగ్యంతో బాధపడుతున్న కోటమర్తి శ్రీనివాస్ వైద్య ఖర్చుల నిమిత్తం ఐటీసీలోని ఎస్ఎస్ఎఫ్‌టీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన తోటి కార్మికులు శనివారం రూ.35వేల ఆర్థికసాయాన్ని అందించారు.

శ్రీనివాస్ కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటామని వారు భరోసానిచ్చారు. కార్యక్రమంలో శేషగిరిరావు,ఉమా, లెనిన్, సాంబారెడ్డి, నగేష్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, శంకరయ్య, నరేష్, వేణు, రమణ, శ్రీనివాస్, రవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏరియా జీఎం దుర్గం రామచందర్

మణుగూరురూరల్: గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ అధికారులకు సూచించారు. శనివారం మణుగూరు ఏరియాలోని పివికాలనీ భద్రాద్రి స్టేడియంలో నిర్వహిస్తున్న వేడుకల ఏర్పాట్లను ఆయన సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవ వేడుకలకు విచ్చేసిన అధికారులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా కుర్చీలు, టెంట్లు, తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించిన పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం వీసం కృష్ణయ్య, ఏజీఎం సివిల్ వెంకటేశ్వర్లు, డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్, అధికారులు శోభన్‌బాబు, డీవీఎస్ఎన్ ప్రవీణ్, అజయ్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య

మణుగూరురూరల్: ప్రతీ కార్యకర్త గ్రామస్థాయి నుంచి సీపీఐ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శక్తివంచన లేకుండా పని చేసిన కార్యకర్తలకు, నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జరగబోయే ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ క్యాడర్ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు మున్నా లక్ష్మీకుమారి, ఆర్.లక్ష్మీనారాయణ, జంగం మోహన్‌రావు, దుర్గ్యాల సుధాకర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్, సర్వర్, వీరయ్య, రమేష్, ఎంపిటిసిలు రామారావు, లక్ష్మయ్య, సోందె కుటుంబరావు, ఎస్వీ నాయుడు, రాములు, బిక్షం, కోటి తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదు కార్యక్రమం



భద్రాచలంఅర్బన్: బీఎల్ఓను వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ శ్రీనివాస్

మణుగూరురూరల్: కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ సమ్మరి రివిజన్-2024లో భాగంగా మండలంలోని 8,990 పోలింగ్ కేంద్రాలతో పాటు పలు ఏరియాల్లో ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా ఏరియాల్లో ఇంటింటిని సర్వే చేస్తూ.. 18సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరి ఓటు వివరాలను అడిగి తెలుసుకున్నారు. జనవరి ఒకటి, 2024 నాటికి 18సంవత్సరాలు నిండిన వారికి నూతన ఓటర్‌గా నమోదు చేసుకోవాలని సూచించారు. ఫారం-6 ద్వారా కొత్త ఓటు హక్కు, చనిపోయిన వారి ఓటు తొలగింపు, ఫారం-8ద్వారా సవరణలు, ఓటు బదిలీ చేసుకోవచ్చని ఆర్ఐ శ్రీనివాస్ తెలిపారు. నూతన ఓటు హక్కు, మార్పులు, చేర్పులు కోసం మీసేవ, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్, స్థానిక కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ లీలావతి, బీఎల్ఓలు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భద్రాచలంలో నిర్వహిస్తున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియను తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. జాబితాలో పేర్లు లేనివారు, చిరునామా తప్పుగా ఉన్నవారు పోలింగ్ బూత్ మార్చుకోవాలనుకున్న వారు పట్టణంలో 41 పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఆయా సేవలను పొందవచ్చని ఆయన తెలిపారు.

అశ్వాపురం: నేడు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాల్లో కొత్త ఓటర్లు తమ ఓటు నమోదు చేసుకోవాలని మొండికుంట ఎంపీటీసీ కమటం నరేష్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఆదివారం బూత్ లెవల్ అధికారులు పోలింగ్ బూత్‌ల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉంటారని, 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొత్త ఓటర్లు, మార్పులు. చేర్పులు, సవరణలకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు.

వైద్యుడి నియామకం

సాక్షి ఎఫెక్ట్..

చర్లరూరల్: చర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం ఎంబీబీఎస్ వైద్యుడిని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నియమించారు. ఇక్కడ ఇన్ని రోజులు వైద్యుడు లేక పోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై శనివారం 'వైద్యులు లేక.. రాలేక'అను శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన ఉన్నతాధికారులు చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి డాక్టర్ బూరుగడ్డ సాయి వర్ధన్‌ను నియమించారు. ఈ మేరకు డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు సాక్షికి వివరాలు వెల్లడించారు. వైద్యుడి నియామకంపై చర్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆడియో విడుదల..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం వాసుల కీర్తనలతో రూపొందించిన 'భద్రాద్రి రామసేవ'ఆడియోను శనివారం స్థానిక సీతారాముల ఆలయంలో విడుదల చేశారు. కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న సినీ డైరెక్టర్ తాండ్ర వెంకటరమణారావు మాట్లాడుతూ.. తాండ్ర రవితేజ, రమణి, సంగీత ఆధ్వర్యాన త్యాగరాజ కృతులు, అన్నమయ్య కీర్తనలు, భక్తి పాటలతో ఆడియో రూపొందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ తాండ్ర నరసింహారావుతో పాటు పొన్నం మనోజ్, రామ తులసి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత బాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు. స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు.

సర్టిఫికెట్ జారీకి క్యాంప్

భద్రాచలంఅర్బన్: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ భవనంలో లైఫ్ సర్టిఫికెట్ విడుదల చేయడానికి ప్రత్యేక క్యాంపును శనివారం ప్రారంభించారు. మార్చి నెలాఖరు వరకు క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భూషణం తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు తమ పీపీఓ నంబర్, బ్యాంక్ అకౌంట్ నంబర్, ఆధార్ కార్డ్ తీసుకువచ్చి లైఫ్ సర్టిఫికెట్ తీసుకోవాలని సూచించారు. లయన్ గోళ్ల భూపతిరావు, వెంకన్న, ఖాదర్, హనుమంతురావు, తులసీదాస్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బల్మూరికి శుభాకాంక్షలు

దమ్మపేట: ఎమ్మెల్యే కోటాలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన బల్మూరి వెంకట్‌ను మండలానికి చెందిన ఎన్ఎస్‌యూఐ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్ఎస్‌యూ అశ్వారావుపేట నియోజకవర్గ అధ్యక్షుడు ఈశ్వరప్రగడ నాగభూషణ్ శనివారం హైదారాబాద్‌లో బల్మూరి వెంకట్‌ను కలసి శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఎన్ఎస్‌యూఐ నాయకులు వేణు, సందీప్ పాల్గొన్నారు.

ఉచిత షుగర్ పరీక్షలు

మణుగూరురూరల్: పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో శనివారం ఉచిత షుగర్ పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. మొత్తం 28 మందికి ఉచితంగా పరీక్షలు చేశారు. రోగులకు ల్యాబ్ టెక్నీషియన్ గాజుల రమేష్‌కుమార్, డాక్టర్ దుస్సా సమ్మయ్యలు పలు సూచనలు ఇచ్చారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గాజుల పూర్ణచందర్‌రావు, కార్యదర్శి మీరాహుస్సేన్, అడబాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

కరకగూడెం: మండల పరిధిలోని వలస ఆదివాసీ గ్రామాల్లో మౌలిక వసతులు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి కొమరం కాంతారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో రోడ్లు, విద్యుత్, మంచినీరు వంటి కనీస సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని కోరారు.

నైపుణ్య శిక్షణతో మేలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: విద్యార్థులకు నైపుణ్య శిక్షణతో ఎంతో మేలు జరుగుతుందని, ప్రతి విద్యార్థీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శనివారం మండలంలోని నారాయణపురం ఉన్నత పాఠశాల, అశ్వారావుపేటలోని బాలికల ఉన్నత పాఠశాలలో వేకువ ఫౌండేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో అధ్యాపకులు వీరమనేని చంద్రశేఖర్ సహకారంతో నియోజకవర్గంలోని ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నైపుణ్య శిక్షణా తరగతులను నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. ఈ తరగతులను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధ్యాపకులు బోధించే అంశాలను విద్యార్థులు శ్రద్ధగా వినాలని, ఈ శిక్షణా వల్ల విద్యార్థుల్లో సమయ నిర్వహణ, లక్ష్య సాధన, మానవతా విలువలు, ఏకాగ్రత జ్ఞాపకశక్తి, నాయకత్వ లక్షణాలు, ఆత్మ విశ్వాసం పెంపొందుతుందని అన్నారు. భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఈ శిక్షణా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

29న పాఠశాల కమిటీ ఎన్నికలు



అన్నపురెడ్డిపల్లి: రాజాపురం జెడ్పీ పాఠశాలలో నోటీస్ బోర్డులో షెడ్యూల్ ప్రతులు..

దమ్మపేట: మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత, జిల్లా పరిషత్ పాఠశాలలకు విద్యా కమిటీ ఎన్నికలు ఈ నెల 29న నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి కీసర లక్ష్మి తెలిపారు. శనివారం మండలంలోని పట్వారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆ పాఠశాల హెచ్ఎం(ఎంఈఓ) మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విద్యా కమిటీల ఎన్నికల నిర్వహణ నిమిత్తం, ఆయా పాఠశాలల్లో విద్యా కమిటీ ఓటర్ జాబితాలు వెల్లడించినట్లు తెలిపారు. ఓటర్ జాబితాపై అభ్యంతరాలు ఉంటే, ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం 2 గంటల్లోపుగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఈ నెల 29న ఎన్నికల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విద్యాకమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సభ్యుల ఎన్నిక జరుగుతుందని తెలిపారు.

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్(ఎస్ఎంసీ) ఎన్నికలు నిర్వహించేందుకు ఆయా పాఠశాలల హెచ్ఎంలు శనివారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎన్నికల షెడ్యూల్ ప్రతులను, అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రుల పేర్లను పాఠశాలల నోటీస్ బోర్డు పై అంటించారు. మండల వ్యాప్తంగా మొత్తం 32 పాఠశాలల్లో ఈ నెల 29న ఎస్ఎంసీ ఎన్నికలు జరగనున్నట్లు ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు.

దేవాలయాల్లో స్వచ్ఛత కార్యక్రమం

భద్రాచలంఅర్బన్: రేపు అయోధ్యలో రామమందిర ప్రాణ ప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో దేశంలోని హిందూ దేవాలయాలను పరిశుభ్రం చేయాలని, ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు భద్రాచలం పట్టణంలోని అల్లూరి సీతారామరాజు కాలనీలోని శ్రీసమ్మక్క సారలమ్మ దేవాలయంలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించినట్లు బీజేపీ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కుంజా ధర్మారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు ఇంట్లో ఎలా శుభ్రంగా ఉంచుకుని పూజచేస్తామో, అలాగే దేవాలయాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భద్రాచలం బీజేపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి రాంమోహన్ రావు, మండల ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన వెంకన్న, మండల కార్యదర్శి కనసాని శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి పీసీ కేశవ్, మండల ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, గడ్డం శ్రీహరి, సూరత్ సుదర్శన్, ఏబీవీపీ నగర కార్యదర్శి అన్నం సాయి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలి



వలస ఆదివాసీలతో మాట్లాడుతున్న సీఐ శివప్రసాద్

పినపాక: అసాంఘిక శక్తులకు, వ్యక్తులకు దూరంగా ఉండాలని ఈ బయ్యారం సీఐ శివప్రసాద్ సూచించారు. శనివారం మండల పరిధిలోని వలస ఆదివాసీ గ్రామాలైన ఉమేష్ చంద్ర నగర్‌లో పర్యటించిన ఆయన.. ఆదివాసీలతో ముచ్చటించారు. గ్రామాల్లో యువత క్రీడల్లో చదువుల్లో రాణించాలని సూచించారు. వలస ఆదివాసీలు కూడా చైతన్యవంతులై అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. గ్రామాల్లోకి ఎవరైనా అసాంఘిక వ్యక్తులు ప్రవేశించినట్లయితే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచార అందించాలని తెలిపారు. ప్రభుత్వం తరఫున ఆదివాసీలకు అండగా ఉంటామని, అన్ని సౌకర్యాలు కల్పిస్తామని భరోసా కల్పించారు. సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

5 పంచాయతీలను తెలంగాణలో కలపాలి



కొదండరాంకు సమస్యను వివరిస్తున్న చల్లగుళ్ల నాగేశ్వరరావు, రామనాథం

భద్రాచలంఅర్బన్: ఆంధ్రాలో కలిపిన 5 గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలోని భద్రాచలంలో కలపాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు కొదండరాంను ఆల్ పెన్షనర్స్, ప్రభుత్వ పెన్షనర్ యూనియన్ తరఫున జిల్లా అధ్యక్షుడు చల్లగుళ్ల నాగేశ్వరరావు కోరారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో కొదండరామ్‌కు భద్రాచలంలో నెలకొన్న సమస్యలను వివరిస్తూ ప్రస్తుతం భద్రాచలం పట్టణానికి డంపింగ్ యార్డ్ కూడా లేని పరిస్థితి నెలకొందని, అప్పటి ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. భద్రాచలం నుంచి పర్ణశాలకు వెళ్లే మార్గంలో యటపాక, కన్నాయిగూడెం గ్రామ పంచాయతీలు ఉన్నాయని, రాష్ట్ర విభజనలో భాగంగా ఈ గ్రామ పంచాయతీలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కలిసిపోయాయని వివరించారు. అప్పటి నుంచి ఈ గ్రామ పంచాయతీల్లో ఉన్న ప్రజలు అనేరకాలుగా ఇబ్బందులు పడుతున్నట్లు వారు తెలియజేశారు. ఈ విషయమై కోదండరాం స్పందిస్తూ ఈ సమస్యల పై భద్రాచలంలో మీటింగ్ పెడితే తాను వస్తానని, పరిష్కారం కోసం అన్ని విధాలా కృషి చేద్దామని బదులిచ్చినట్లు చల్లగుళ్ళ నాగేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ జన సమితి జిల్లా నాయకులు మల్లెల రామనాథం పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న హెచ్‌యం బోళ్ల వెంకటేశ్వర్లు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన..

దుమ్ముగూడెం: మండలంలోని నరసాపురం గ్రామంలోని సూది రెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో 2023-24 పాఠశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధిలో కీలక భూమిక పోషించిన సుదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ ట్రస్ట్ సేవలను కొనియాడారు. ట్రస్ట్ తరఫున వెంకట రమణారెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడలు, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ట్రస్ట్ సౌజన్యంతో వెంకట రమణా రెడ్డి అందజేశారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోల్ల వెంకటేశ్వర్లు, నరసాపురం సర్పంచ్ వి.శివ రామకృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ విద్యాసాగర్ రావు, ఉప సర్పంచ్ రావులపల్లి రవికుమార్, ఎంఈఓ సమ్మయ్య, హెచ్‌యం కేవీ.కాంతారావు, ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.